మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## పీజీఆర్ఎస్ అర్జీలను సీరియస్ గా తీసుకోవాలి



2లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 153 | మంగళవారం | 25 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## హిందువుల మనోభావాలను

# గౌరవించండి

- అయ్యప్ప భక్తులకు కనీస వసతులు కల్పించకపోవడం అన్యాయం
- ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ తీరు సమంజసంగా లేదు... ఇలాగే వ్యవహరిస్తే నిరసనలు చేపడుతాం
- హెచ్చరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : అయ్యప్ప భక్తులు పడుతున్న కష్టాలు చూసి నా హృదయం చలించిపోతుందని, హిందువుల మనోభావాలను గౌవరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ఏళ్లతరబడి అయ్యప్పను దర్శించుకునేందుకు భక్తులు తరలిస్తూనే ఉన్నారని, అయితే కనీస వసతులు కల్పించకపోవడం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి తగదన్నారు. ప్రత్యేకించి అయ్యప్ప భక్తులపై పోలీసుల తీరు సమంజసం కాదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేరళ కమ్యూనిస్ట్ ప్రభుత్వం అయ్యప్ప భక్తులకు వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వం హిందువులపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అయ్యప్ప సేవా సంఘం, అమృతానందమయి మఠం లాంటి ధార్మిక సంస్థలు సేవ చేయకుండా అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. కేరళ సర్కార్ తన వైఖరి మార్చుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



## బీజేపీ బలోపేతానికి

# కృషి చేయాలి

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : విజయవాడ భవాని ఐలాండ్‌లో జరిగిన బీజేపీ “సంస్థాగత యోజన బైఠక్”లో పార్టీ ఇన్ చార్జ్ శివప్రకాశ్, మంత్రి సత్యకుమార్, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధీశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితర నేతలతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి రాబోయే కార్యక్రమాలపై చర్చించారు. బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

## కర్నూలు నగరపాలక మేనేజర్‌కు అరుదైన గౌరవం

- ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం
- ఆంధ్ర సారస్వత సేవా పురస్కారం ప్రకటింపు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడుకు అరుదైన గౌరవం లభించింది. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు అతిథిగా హాజరు కావాలని ఆహ్వానిస్తూ పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్, మహాసభల ప్రధాన సమన్వయకర్త పి.రామచంద్రులు అధికారిక ఆహ్వాన పత్రాన్ని పంపించారు. యన్.చిన్నరాముడు నగరపాలక సంస్థలో తెలుగు భాషా ప్రచారం, వికాసానికి అంకితభావంతో అందిస్తున్న విశిష్ట సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని, తెలుగు భాషాభిమానానికి ఆయన చూపుతున్న నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకమని లేఖలో పేర్కొన్నారు. మహాసభల ప్రధాన కార్యక్రమంలో ఆయనకు “ఆంధ్ర సారస్వత సేవా పురస్కారం” ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.



## రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి

- నాణ్యతా ప్రమాణాలతో పనులు కొనసాగాలని అధికారులకు ఆదేశాలు

మన గళం, ఏలూరు : ఏలూరు జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పొంగుటూరు-లక్కవరం రహదారి అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ 6.1 కి.మీ ముఖ్య రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం 1.5 కోట్లు మంజూరు చేశారని, ఆ నిధులతో జరుగుతున్న మరమ్మత్తు పనులనులో పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. రహదారి పనుల నాణ్యత, వేగం, ఉపయోగిస్తున్న సామగ్రి గురించి పవన్ కల్యాణ్ వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణంలో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు త్వరగా ఉపశమనం లభించాలంటే పనులు మరింత దృఢంగా, సమయానికి పూర్తి చేయాలని ఆయన సూచించారు. గ్రామాలకు పట్టణాలకు అనుసంధానించే ఈ రహదారి అభివృద్ధి ప్రాంతీయ రవా ణాకు కీలకమని ఉప

2 లో..



## స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్‌తో సుపరిపాలన లక్ష్యం

- జూన్ నాటికి 1.4 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ కార్డులు

మన గళం, అమరావతి : రాష్ట్రంలో సుపరిపాలనను మరింత బలోపేతం చేస్తూ ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్ మెంట్ సిస్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒక్క కార్డు ద్వారా అందుబాటులో ఉండే విధంగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డు రూపొందించాలనీ ఆయన స్పష్టం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్ ఆధారంగా కుటుంబ, వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అధికారులకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ 2026 నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను అందజేయాలని సీఎం ఆదేశించారు.
ఈ కార్డు ద్వారా 25 రకాల సేవలు

2 లో..

## రోగులకు మెరుగైన వైద్య

# సేవలు అందించాలి

- వైద్య పరీక్షలు, మందులకు రోగులను బయటకు పంపరాదు
- పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పేపర్ లెస్ సేవలు అందుబాటులోకి తీసుకొని రావాలని, రోగులకు పరీక్షలు, మందులకు బయటకు రెఫర్ చేయరాదని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి టి.జి. భరత్ అధికారులను ఆదే శించారు. సోమవారం ఉదయం కర్నూలు సర్వజన ఆసుపత్రి మరియు మెడి కల్ కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ మెడికల్ కాలేజ్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నెక్స్ట్ జెన్ సాఫ్ట్వేర్ ను వినియోగించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని సేవలు పేపర్ లెస్ గా వైద్య సేవలు అందించే చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, నైపుణ్యం సమకూర్చుకోవడానికి, సాఫ్ట్వేర్ పై అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని ఎన్.ఐ.సి డి.ఐ.ఓ ప్రవీణ్ రెడ్డి ని మంత్రి ఆదేశించారు. విదేశాల్లో ఉన్న కర్నూలు కాలేజ్ లో చదివిన డాక్టర్లు 50 కోట్ల రూపాయలు వెచ్చించి నాలెడ్జ్ సెంటర్ ను స్థాపించడానికి ముందుకు వచ్చారని, వారికి అనుకూలమైన ప్రదేశం లో స్థలాన్ని కేటాయించాలని, అందుకు మెడికల్ కాలేజీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. వేల మందికి వైద్య సేవలు అందిస్తున్న కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రికి ఒక ఎలక్ట్రికల్

2 లో..

## క్లైమేట్ యాక్షన్ ఉద్యమానికి నాంది




మన గళం, అమరావతి : ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన సంస్థ వన్ మిలియన్ వన్ బిలియన్ బృందంతో సంభాషించడం ఆనందమేసిందని నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పంలో ‘1.5 మ్యాటర్స్’ క్లైమేట్ యాక్షన్ ఉద్యమాన్ని ప్రారంభించడం తనకు

2 లో..

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు




మనగళం, కర్నూలు సిటీ: ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను నిధుల కొరత పేరుతో నిర్మాణంలో ఉన్న పిపిపి విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం తగదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు హెచ్చరించార. సోమవారం బిర్లా కాంపౌండ్ లో బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం లక్ష్మీ నరసింహ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిపిపి విధానంలో 10 ప్రభుత్వ మెడికల్ కళాశా లలను ప్రైవేటీకరణ కొరకు తీసుకు వచ్చిన 590 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను, అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటుపరం చెయ్యాలనే ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పేదలందరికి

2 లో..

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

ఉచిత మెడికల్ సీట్లు ఇచ్చే బాధ్యత తీసుకొంటామని కల్లబోల్లి మాటలు చెప్పిన కూటమి నాయకులు నేడు మొత్తం మెడికల్ కాలేజీలనే ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి పీపీపీ విధానాన్ని తీసుకురావడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. విద్య, వైద్య రంగాలు లాంటి సేవా రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలి, వైద్య విద్య, వైద్యం ప్రైవేటు పరం అయితే సామాజిక న్యాయం దక్కదు, పేదలు అప్పులు పాలవుతారు , రైతులు ఆత్మహత్యలకు ఖరీదైన వైద్యం కారణమౌతుంది. వైద్య విద్య ప్రైవేట్ రంగంలో ఉంటే అర్హత లేని కోట్లాది రూపాయలు వెచ్చించ గల కోటేశ్వరుల బిడ్డలకే మెడికల్ సీట్లు దక్కుతాయని, అర్హత గల పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తున్నారు, విద్యా ఉద్యోగ రంగాలలో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను బీసీ, యస్సి, యస్టీ లకు దక్కకుండా చేయాలనే కుట్రతోనే పీపీపీ విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. 3 లక్షల 29వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో కేవలం 5 వేల కోట్లు ఖర్చు పెడితే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, 10 ప్రభుత్వ ఆసుపత్రులలో వేలాది మందికి వైద్య విద్య, కోట్లాది మందికి నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించగలమన్నారు. ఎఐసిసి సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఇంచార్జ్ లక్ష్మీనరసింహ యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్ మాట్లాడారు. నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఏ విద్యార్థి అయినా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చేరడానికే మొదటి ప్రాధాన్యత నిస్తాడని, కొత్తగా వచ్చిన బందరు, ఏలూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో కూడా ఎన్ఆర్ఐ, నారాయణ లాంటి ప్రైవేట్ మెడికల్ కాలేజీల కంటే పోటీ అధికంగా ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షులు షేశఫణి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్నా, కాంగ్రెస్ పార్టీ డోన్ అసెంబ్లీ ఇంచార్జ్ డా గార్లపాటి మద్దులేటి స్వామి, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, మైనార్టీ రజాక్ వళి,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ బాలస్వామి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు, అడ్మిన్ ఉన్నిగొర్ల జనార్ధన్ , సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన నేరుగా విని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తిచేయాలని ఆయన శాఖాధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనతో రహదారి పనులు వేగవంతం అవుతాయనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఇంజనీర్ ను కేటాయించవలసిందిగా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ ప్రదీప్ కుమార్ ను మంత్రి ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు జనరేటర్లు ఆటోమేటిగ్గా పనిచేసి విద్యుత్ అందించే చర్యలు సమర్ధవంతంగా ఉండే చర్యలు తీసుకుంటూ ఉండాలని ఆదేశించారు. ఐసీయూలో ఉన్న ఎయిర్ కండిషన్ యూనిట్ల వివరాలు వాటి మెయింటినెన్స్ విషయాలు, ఆసుపత్రికి కావలసిన కంప్యూటర్లు, ప్రింటర్లు, కంటి ఆసుపత్రికి కావలసిన ఓటీఎస్ మిషిన్, క్యాన్సర్ ఆసుపత్రికి రావలసిన 20 కోట్ల రూపాయల బడ్జెట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా రోగుల సహాయకులకు నిర్మించ తలపెట్టిన విశ్రాంతి భవనం, అనస్తీషియా వర్క్ స్టేషన్ల ఏర్పాటు, రోస్టర్ పాయింట్‌ల ప్రకారం చేస్తున్న నియామకాల విషయాలు నివేదిక రూపంలో సమర్పించవ లసిందిగా ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ని ఆదేశించారు. సర్వజన ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సర్వ జన ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న వెహికల్ పార్కింగ్ , సీసీటీవీ కెమెరాలు, ఆక్సిజన్ సప్లై పైపులు ఏర్పాటు, ఆసుపత్రిలో జంగిల్ క్లియరెన్స్ పనులు, 50 పడకల క్రిటికల్ కేర్ వార్డ్ పనుల గురించి మంత్రికి వివరించారు. రెండు డయాలసిస్ మిషన్లు ఆసుపత్రికి వచ్చాయని, అన్న క్యాంటీన్ పరిశుభ్రంగా సజావుగా నడుస్తున్నదని , ఆర్వో ప్లాంట్లు పనిచేస్తున్నవని, జంతువులు రాకుండా సరైన చర్యలు తీసుకుంటున్నామని మొదలగు విషయాలు మంత్రికి తెలియజేశారు. ఈ సమావేశానికి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, క్యాన్సర్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రకాష్, ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్ , రఘునాథ్ రెడ్డి , జగదీష్ , ప్రదీప్ , ఏపీఎంఐడిసి సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

# క్లైమేట్ యాక్షన్ ఉద్యమానికి నాంది



గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమం కుప్పం నుంచి ఆరంభమవడం విశేషమన్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నివారణ పై యువతలో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ ఉద్యమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల పాల్గొనడం, శిక్షణ కార్యక్రమాలు, స్థానిక స్థాయిలో పర్యావరణ చర్యలు ఈ ఉద్యమంలో భాగంగా ఉంటాయి. ఈ కార్యక్రమం సందర్భంగా కుప్పంలో వన్ మిలియన్ వన్ బిలియన్ గ్రీన్ ఇంటర్న్‌షిప్పు కూడా నారా భువనేశ్వరి ప్రకటించారు. ఏఐసీటీఈ, సేల్స్‌ఫోర్స్ సహకారంతో అందిస్తున్న ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా యువతకు స్థిరమైన అభివృద్ధి (సస్టైనబిలిటీ), హరిత సాంకేతికత, నూతన డిజిటల్ నైపుణ్యాలపై ప్రత్యక్ష అనుభవం లభించనుంది. "ఆంధ్రప్రదేశ్ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజానికి ఉపయోగపడే విజయవంతమైన కెరీర్‌లు నిర్మించాలి" అని భువనేశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు. వన్ మిలియన్ వన్ బిలియన్ బృందం చేస్తున్న సేవలు దేశ భవిష్యత్తుకు దోహదం చేస్తాయని ఆమె అభినందించారు.

# స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్‌తో సుపరిపాలన లక్ష్యం

అందుబాటులో ఉండాలనీ, పీ4 వంటి అంశాలూ ఇందులో కలగాలన్నారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న డేటాను ఇతర శాఖలూ ప్రామాణికంగా తీసుకుని సేవల అందింపులో ఉపయోగించుకునేలా వ్యవస్థను రూపొందించాలని చెప్పారు. స్టాటిక్, డైనమిక్ డేటా రెండూ నిరంతరం అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. వాక్సినేషన్, ఆధార్, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వివిధ ప్రభుత్వ పథకాల వివరాలు ఈ కార్డు ద్వారా ట్రాక్ అయ్యే విధంగా వ్యవస్థను విస్తరించాలన్నారు. కేవలం రేషన్, పెన్షన్ల వరకే కాకుండా పౌరుల సమాచారమంతా ఈ ఎఫ్‌బీఎంఎస్‌లో ఉండాలని సీఎం స్పష్టం చేశారు. లబ్దిదారుల ఎంపికలో ఎదురయ్యే సవాళ్లు కూడా ఈ సిస్టమ్ ద్వారా పరిష్కారమవుతాయని ఆయన గుర్తించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ల ద్వారా కుటుంబ వివరాలు నిరంతరంగా అప్డేట్ అయ్యేలా చూడాలని సీఎం విలేకరులతో తెలిపారు. ఆధార్ సహా పౌరులకు



సంబంధించిన అన్ని సమాచారమూ ఒక్క ఫ్యామిలీ కార్డ్‌లోనే కనిపించేలా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి 2026 నాటికి పూర్తి వివరాలను క్రోడీకరించి, జూన్ నాటికి కార్డుల పంపిణీ పూర్తిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం ప్రారంభం



– రైతు సంక్షేమమే మా లక్ష్యం: కింజరాపు అచ్చెన్నాయుడు
– పంట నుండి మార్కెట్ వరకు ప్రతి దశలో సహాయం

మన గళం, ఘంటసాల : కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డా. మండలి బుద్ధప్రసాద్, ఉన్నతాధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ పద్ధతులను చేరువ చేయడమే ఈ వేదిక లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయంలో రైతులకు అవసరమైన శిక్షణను కృషి విజ్ఞాన కేంద్రాలు అందిస్తాయని అన్నారు. కొత్త పంట రకాలు, అధిక దిగుబడులు సాధించే ఆధునిక సాగు విధానాలు, మార్కెటింగ్ పద్ధతులపై రైతులకు పూర్తి మార్గదర్శకత్వం ఇస్తామని చెప్పారు. "రైతే దేశానికి వెన్నెముక అన్న నినాదాన్ని నిజం చేస్తూ, రైతుల అభ్యున్నతికోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను" అని మంత్రి హామీ ఇచ్చారు. పంట నాటడం నుండి కోయడం, మార్కెటింగ్ వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. సాగులో ఎదురయ్యే సమస్యలపై రైతుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. "మన రైతుల కష్టానికి తగ్గ మంచి ఫలితం తప్పకుండా వస్తుంది" అని మంత్రి రైతులను ధైర్యం చెప్పారు. ఘంటసాలలో రైతులు వ్యక్తం చేసిన ఆనందం చూసి మరింత ప్రేరణ పొందినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులు శాస్త్రీయ సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధిస్తారని నమ్మకం వ్యక్తం చేశారు. "మీ మంత్రిగా, నేను ఎల్లప్పుడూ రైతు పక్షమే" అని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# అజిత్‌సింగ్‌నగర్‌లో ఈగిల్ సైకిల్ ర్యాలీ

**– మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపు – ఐజీ ఎ.కె. రవికృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ**

మన గళం, విజయవాడ : మాదకద్రవ్యాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు "డ్రగ్స్‌కు నో బ్రో - సైకిల్ తొక్కు బ్రో" అనే నినాదంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈగిల్ విభాగం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ర్యాలీకి ఈగిల్ విభాగాధిపతి, ఐజీ ఎ.కె. రవికృష్ణ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు. ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం కోసం సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని సందేశమిచ్చారు. డ్రగ్ వ్యసనంతో కుటుంబాలు, సమాజం ఎదుర్కొంటున్న నష్టాలను అరికట్టేందుకు ఈగిల్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతం ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ర్యాలీకి ఆత్మీయంగా స్పందించారు




# గురుద్వారా రకాబ్ గంజ్ సాహిబ్‌లో ఉపరాష్ట్రపతి నివాళి

**శ్రీ గురు తేఘ్ బహదూర్ 350వ శహీద్ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక దర్శనం**

మన గళం, న్యూఢిల్లీ, భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేడు న్యూఢిల్లీ లోని గురుద్వారా రకాబ్ గంజ్ సాహిబ్‌ను సందర్శించారు. శ్రీ గురు తేఘ్ బహదూర్ జీ 350వ శహీద్ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో ఉపరాష్ట్రపతి గురుద్వారాలో ప్రార్థనలు చేసి, గురువారి పవిత్ర ఆశీస్సులు పొందారు. దేశంలో శాంతి, సామరస్యం, సర్వత్ర అభ్యుదయం నెలకొనాలని ప్రార్థిస్తూ ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా మొక్కుకున్నారు. భారత జాతికి గురు తేఘ్ బహదూర్ జీ చూపిన ధైర్యం, ధర్మరక్షణ పథం నేటికీ ప్రేరణగా నిలుస్తోందని గురుద్వారా నిర్వాహకులు గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న గురు తేఘ్ బహదూర్ జీ శహీద్ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొనడం సిక్కు సమాజం ఎంతో సంతోషంగా స్వాగతించింది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# పీజీఆర్ఎస్ అర్జీలను సీరియస్ గా తీసుకోవాలి

– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పీజీఆర్ఎస్ అర్జీలను సీరియస్ గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ -పీజీఆర్ఎస్ ) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. అధికారులందరూ పీజీఆర్ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వచ్చిన వెంటనే అర్జీలను చూస్తే, రెవెన్యూ అర్జీల లాంటి వాటికి నోటీసులు ఇచ్చే టైమ్ ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్, ఎండార్స్మెంట్ లు సరిగా ఇవ్వకపోవడం, రీ ఓపెన్ అయిన కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఉన్న కింది స్థాయి అధికారులకు మెమో లు జారీ చేసి, సంబంధిత మెమో లను వాట్సప్ గ్రూప్ లో పోస్ట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 10 రోజులకు ఒకసారి వివిధ శాఖల హెచ్ ఓ డి లు వారి కింది స్థాయి సిబ్బందితో పిజిఆర్ఎస్ అంశం పై ట్రైనింగ్ లు నిర్వహించాలని, ఆ ఫోటోలను గ్రూప్ లో కూడా పోస్ట్ చేయాలన్నారు. అదే విధంగా ప్రతి రోజు కొంతమంది అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. అర్జీలు గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని, రీ ఓపెన్ కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కి సంబంధించి అన్ని ఆసుపత్రులలో జిల్లాలో ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలన్నారు. టోల్ ఫ్రీ ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో క వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రోడ్లు, పారిశుధ్యం, తాగు నీటికి సంబంధించి మున్సిపాల్టీ లలో ఎక్కువగా వార్తలు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సమస్యపై అర్జీదారులు పలుమార్లు తిరగకుండా సమస్యను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోయే వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎస్.ఎస్. ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్డీవోలు తనిఖీ చేసి మరమ్మతులు ఉంటే, 10 రోజులలోపు మరమ్మతులు పూర్తి చేయించాలన్నారు. డిసెంబర్ లో ట్యాంక్ లు, చెరువులు నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో, మండలాల్లో రక్షిత పథకాల నుండి తాగు నీరు అందరికీ సమానంగా, సక్రమంగా పంపిణీ చేసేలా మండల లెవెల్ స్థాయిలో సమావేశం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 30వ తేదీన భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు



మనగళం, కర్నూలు సిటీ : గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న భగవద్గీత కంఠస్థ పఠణ పోటీలలో భాగంగా ఈనెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9-00 గంటల నుండి కర్నూలునగరం, సి. క్యాంపులోని తి.తి.దే. కళ్యాణ మండపం నందు పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలుజిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అచలానందాశ్రమం పీఠాధిపతులు విరజానంద స్వామీజీచే కర్నూలు నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానములు కళ్యాణ మండపం నందు ఆవిష్కరించారు. విద్యార్థులకు బాల్యం నుండే భగవద్గీతను బాల్యంనందే నేర్పడం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు పెరగడంతోపాటు, గొప్ప వ్యక్తిత్వ నిర్మాణం జరిగుతుందని స్వామీజీ అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు "ప్రతి ఇంటా భగవద్గీత - ప్రతి నోటా భగవద్గీత" అని సంకల్పించుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం పోటీల విధివిధానాలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారని, 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగము మొత్తం 27 శ్లోకాలు,10వ తరగతి, ఇంటర్ విద్యార్ధులకు 16వ అధ్యాయము దైవాసుర సంపద్విభాగయోగము మొత్తము 24 శ్లోకాలు,18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలలోపు వారికి "నిత్యజీవితంలో భగవద్గీత - భావ విశ్లేషణ" అనే అంశంపై ఈ పోటీలు కర్నూలు జిల్లాకు వారికి మాత్రమే నిర్వహించబడునని తెలిపారు. ప్రతి విభాగం నుండి విజేతలను గుర్తించి వారికి ప్రథమ బహుమతి రూ1116, ద్వితీయ బహుమతి రూ816, తృతీయ బహుమతి రూ516తోపాటు తితిదే నుడి ప్రశంసా పత్రము, జ్ఞాపికను బహూకరించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనబోయే అభ్యర్థులందరూ ముందుగా తమ తమ పాఠశాలు, కళాశాలల నుండిగాని, స్వయంగాగాని విద్యార్థుల జాబితాను 9059802265 వాట్సాప్ నెంబర్ కు పంపవలెనని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోదా విష్ణు సహస్రనామ పారాయణ సంఘం అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా, ధార్మిక సంస్థల ప్రతినిధులు తుమ్మేపల్లె శ్రీనివాసులు,ఆకుల జయకృష్ణ, ఎ. హరి, డి.వంశీ,కె. వేణుగోపాల్, నరహరి వెంకట రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండ్రేవుల జలాశయం కోసం ఐక్య పోరాటం



మనగళం, కర్నూలు సిటీ : రాయలసీమకు జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్ట్ సాధనలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఐక్య పోరాటం చేస్తామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష అన్నారు. సోమవారం రాజ్ విహార్ నుండి ధర్నా చౌక్ వరకు రైతులు, యువత, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద 48 గంటల జల సమర దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. కర్నూలు నగరానికి తాగునీరు, పశ్చిమ కర్నూలు రైతులకు సాగునీరు అందించగల శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న గుండ్రేవుల ప్రాజెక్ట్ అత్యవసరతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కేపియస్ ఈ దీక్షను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గుండ్రేవుల ప్రాజెక్ట్ పూర్తయితే రాయలసీమ నీటి భద్రత, సాగునీటి స్థిరీకరణ, పరిశ్రమలకు నీటి లభ్యత, వర్షప్రమాద నియంత్రణ వంటి అంశాల్లో శాశ్వత మార్పులు సంభవిస్తాయని. ప్రజలు, యువత, విద్యార్థులు, రైతు సంఘాలు కలిసి చేస్తున్న ఈ ఉద్యమం ప్రాంత భవిష్యత్తు కోసం ప్రజా ఐక్యతకు పెద్ద నిదర్శనమని పేర్కొన్నారు. ఉదయం రాజ్‌విహార్ ఆర్టీసీ పాత డిపో వద్ద రైతులు, యువత, విద్యార్థులతో భారీ ర్యాలీ ప్రారంభమై ధర్నా చౌక్‌కు చేరుకుంది. అక్కడ నిర్వహించిన సభలో నేతలు గుండ్రేవుల ప్రాజెక్ట్ అత్యవసరతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎం.శ్రీహర్ష 48 గంటల జల సమర దీక్షకు కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా సీఎల్పీఎం సెంట్రల్ జనరల్ సెక్రటరీ గఫూర్, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ జి.పుల్లయ్య, కె.వి.సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, కర్నూలు ఇంటెలెక్చువల్ ఫోరం కన్వీనర్ మంసూర్, మాజీ కార్పొరేటర్ పుల్లారెడ్డి, సీనియర్ అడ్వకేట్ హేమలత, ఆర్వీపీఎస్ రవి, విద్యార్థి నాయకుడు కోనేటి వెంకట్, బీఎస్పీ నాయకుడు అరుణ్ కుమార్, నౌషాద్, సి.బెలగల్ నాయకుడు వెంకటేష్, రైతు సంఘం నాయకుడు పులకుర్తి భాస్కర్ రెడ్డి తదితరులు హాజరై సంఘీభావం ప్రకటించారు.

# మసీదు కమిటికి... మంత్రి దన్యవాదాలు



మనగళం, కర్నూలు సిటీ : రోడ్ విస్తరణకు సహకరించిన మెడికల్ కాలేజీ ప్రక్కన ఉన్న మసీదు కమిటీ సభ్యులకు మంత్రి టీ.జీ భరత్ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఎం పి నాగరాజు, కుడా చైర్మెన్ సొమిశెట్టి వెంకటేశ్వర్లు , కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలి

- 26 భారీ ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి




మనగళం, కర్నూలు సిటీ : లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ సాయి బాబా, జిల్లా నాయకులు టి రాముడు, నగర అధ్యక్షులు నగేష్, ఉపాధ్యక్షులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కర్నూల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వే స్టేషన్ ఎదుట 26వ తేదీన నిర్వహించే ధర్నాకు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ రోడ్డు నుండి రైల్వే స్టేషన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ను దేశవ్యాప్తంగా కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ వల్ల భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం 1926సం. నుండి సాధించుకున్న 29 చట్టాలు రద్దు అవుతాయని తెలిపారు. వీటివల్ల కార్మికులకు ఉన్న శక్తివంతమైన చట్టాలు బలహీనమై కార్మికులు ఉద్యోగులు యజమానుల దగ్గరగా బానిసలుగా పనిచేయవలసి పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా సంఘం పెట్టుకునే హక్కు, పని గంటల భారం, కార్మికుడికి న్యాయంగా రావాల్సిన వాటికోసం యజమానుల దయా దక్షిణాల మీద ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# 30వ తేదీలోపు పేరును నమోదు చేసుకోవాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పీఎంఏవై-2 గ్రామీణ్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగి, ఇల్లు లేని వారు నవంబర్ 30 వ తేదీ లోపు తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం ఉన్నవారు, ఇంటి స్థలం లేని వారు సంబంధిత సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా తమ పేరు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇల్లు మంజూరు అయిన వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 30వ తేదీ తర్వాత పేరు నమోదు చేసుకోవడానికి అవకాశం లేనందున, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని వారు త్వరితగతిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆయా మండలాల ఎంపీడీవోలు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగి, ఇళ్లు లేని వారి పేర్లు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రెస్ క్లబ్ ఏర్పాటు అభినందనీయం



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా కేంద్రం కర్నూలులో ప్రెస్ క్లబ్ ఏర్పాటు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదని సీనియర్ పాత్రికేయులు, స్థానిక దినపత్రికల సంపాదకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని స్థానిక దినపత్రిక సంపాదకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కల ఫలించిందని, అందరికీ సభ్యత్వం కల్పించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ గుప్తాను కోరారు. ప్రెస్ క్లబ్ అన్ని మీడియా లో ఉండే పాత్రికేయులకు ఉపయోగకరంగా ఉండేలా సౌకర్యాలు కల్పించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయులు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి చేయూత ఇవ్వడం ఎంత అవసరమన్నారు. ప్రెస్ క్లబ్ లో రీడింగ్ రూమ్ ఉండటం చాలా సంతోషాన్ని కలిగిస్తున్నారన్నారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి స్వచ్ఛందంగా దాతలు చేయూతనివ్వడం అభినందనయమన్నారు. తాము సైతం తమవంతుగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి చేయూత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ సహకారం కూడా ఎంత అవసరమని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళి, భూపాల్, ప్రెస్ క్లబ్ సభ్యులు కరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

మనగళం, బనగాలనపల్లె : బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయానికి పలుకూరు గ్రామానికి చెందిన కస్తూరి నాగేంద్రప్రసాద్ దంపతులు ఆరువేల విలువగల వెండి వెండి హారతి పళ్లెం పూజారి శ్రీనివాసులకు అందజేశారు. ఈ సందర్భంగా జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఏఎస్ బ్రహ్మోనందచారి పూజారి శ్రీనివాసులును అభినందించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బ్రహ్మోందచారి మాట్లాడుతూ మీరు కాశీ తిరుపతిలో దానం చేస్తే ఎటువంటి పుణ్యం వస్తుందో గ్రామీణ ప్రాంత దేవాలయంలో దానం చేసిన అటువంటి పుణ్యం వస్తుందన్నారు.కార్యక్రమంలో కస్తూరి నాగేంద్ర ప్రసాద్, హనుమంతు, ఆదిరెడ్డి, కరెంటు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పరమేశ్వర సేవతో... దైవదర్శనం దొరుకును.

**- విశేష పూజలు అందుకున్న శ్రీ భీమలింగేశ్వర స్వామి.**

( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో కోట వీధిలో స్థానికంగా వెలసిన శ్రీ లలితా పరమేశ్వరి శ్రీ భీమలింగేశ్వర మహా స్వామి ఆలయంలో మార్గశిర మాసం సందర్భంగా శివదీక్ష స్వాములు సమక్షంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి వారికి విశేషంగా పంచామృతాభిషేకం, పుష్పార్చన, బిల్వార్చన, భస్మార్చన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ భీమలింగేశ్వర స్వామి వారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. శివదీక్షను స్వీకరించండి...ఓం నమశ్శివాయ శివ పంచాక్షరి మంత్రాన్ని పఠించండి. ఈ కార్యక్రమంలో శివదీక్ష గురు స్వామి కిష్టప్ప, మరియు శివ స్వామిలు మరియు ఆలయ అర్చకులు యుగంధర్ స్వామి, శివరుద్రయ్య స్వామి, మల్లికార్జున స్వామి, ఎర్రిస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# కపటప్రేమ ఒలకబోస్తున్న జగన్

మనగళం, కర్నూలు సిటీ : వైసీపీ అధ్యక్షులు వై. యస్. జగన్మోహనరెడ్డి రైతులపట్ల కపటప్రేమ ఒలకబోస్తున్నారని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సూచించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ జగన్మోహన్రెడ్డి చేసిన విమర్శలను తిక్కారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 నుండి 2024 జూన్ వరకు ముఖ్యమంత్రిగా పదవిలో ఉన్న జగన్మోహన్రెడ్డి తన 5 సంవత్సరాల పాలనలో రైతాంగం ఎన్ని కష్టనష్టాలు ఎదుర్కొన్నారో అన్నదాతలకు తెలుసునన్నారు. ఏరోజు కూడా తాడేపల్లి ప్యాలెస్ నుండి ప్రజల మధ్యకు రాని జగన్ రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తుఫాన్లు, వరదలు వచ్చిన సమయంలో కనీసం రైతులగురించి ఆలోచించిన పాపానపోలేదు. తుఫాన్ నుండి పంటలను కాపాడుకునేందుకు పట్టాలు, కాళీ గోనె సంచులు కోరగా పోలీసులచేత లాఠీచార్జీ చేయించిన విషయాన్ని మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. అలాగే రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరగా అవహేలన చేసి, కనీసం వారి నుండి వినతులు కూడా స్వీకరించకుండా వెళ్లలేదా? అని ప్రశ్నించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టించి రైతుల నడ్డి విచావు. అలాగే నాణ్యత లేని విద్యుత్నచ్చి రైతులు వాడుకునే వ్యవసాయ మోటార్లు కాలిపోయి నష్టాల బారిన బారినపడేలా చేశావు, సమయపాలన లేకుండా విద్యుత్ ఇచ్చి రాత్రివేళల్లో రైతులు విషసర్పాల బారినపడి మరణించేందుకు కారణమయారు. రైతుల నుండి పంటకొనుగోలు చేసిన మీ ప్రభుత్వం, బకాయిలు దాదాపు రూ. 674.47 కోట్ల మేరకు ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాల గోదావరి భవన్లో రైతులకు చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో వై.సి.పి. ప్రభుత్వం హయాంలో రైతులకు ఎంతో ద్రోహం చేసి, ఈ రోజు నీతులు చెప్పడాన్ని చూస్తే తన తప్పులను తాను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు పై నిందలు వేస్తున్నాడు. తాను సి.యం.గా ఉ న్నప్పుడు 10 కి.మీ. దూరం ప్రయాణం చేయాలంటేనే హెలిక్యాప్టర్లో వచ్చి పరదాల చాటున వెళ్లిన జగన్ ఈ రోజు చంద్రబాబు దుబారా ఖర్చులు చేస్తున్నారని అంటున్నారు. వై.సి.పి. హయాంలో కేవలం స్నాక్స్ కోసమే కోట్లాది రూపాయలు ఖర్చుచేసిన విషయం మరిచారా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అను నిత్యం రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, రైతుల కోసం వ్యవసాయంలో వినూతనమైన పద్ధతులను పాటిస్తూ, పంటల దిగుబడులు పెంచేందుకు, సాంకేతికంగా రైతులకు పరికరాలను అందించి వారికి సేద్యం సులభతరం చేస్తూ పంటల ను కాపాడుకునేందుకు డ్రోన్ల సహకారంతో పంటలకు పిచ్చుకారి మందుల ఉపయోగిస్తూ ఆర్థిక భారాన్ని తగిస్తున్నారన్నారు. గత సంవత్సరం పొగాకు రైతుల నుండి కొనుగోలు చేసిన దానికి కేవలం 48 గండలలోనే రైతులకు వారి సొమ్ము చెల్లించిందని, ఉల్లి రైతుల నుండి రూ.1200 క్వింటాల మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయడమేకాక పెక్టారకు రూ.50 వేల సహాయాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలను మార్కెటింగ్ ద్వారా కొనుగోలు గురించి మాట్లాడటం, అలాగే అరటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి నిమిత్తం వారికి రవాణా సదుపాయాన్ని ఏర్పాటుచేసేందుకు అధికారులకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. రైతులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు ఇప్పటికే రెండు వితలుగా ఒక్క రైతు ఖాతాలో రూ.14 వేల వరకు జమచేయడం జరిగిందనీ, దీనివల్ల రాష్ట్రంలోని సుమారు



48,86,838 మంది రైతులకు లబ్ధిచేకూరిందనీ తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ఏ రాష్ట్రంలో ఏ ముఖ్య మంత్రి కూడా చేయని అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేశారన్నారు. యదార్థ విషయాలు తెలుసుకోకుండా తన హయాంలో జరిగినటువంటి లిక్కర్, కల్తీనెయ్యి, భూదందాలు, ఇసుక, మైనింగ్ వంటి మాఫీయాల గురించి ఒక్కొక్కటి బయటపడుతుంటే దిక్కుతోచని జగన్ ప్రజల దృష్టిక మరల్చేందుకు చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేయడం గురివింద సామేతను గుర్తుకు తెస్తుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ చౌకబారు ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల తిరుగుబాటు చవిచూడాల్సి వస్తందని ఈ సందర్భంగా తిక్కారెడ్డి హెచ్చరించారు.

# ప్రేమతో కూడిన స్థిరమైన కుటుంబాన్ని కల్పించండి

**- కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు సిటీ : దత్తత ద్వారా ప్రతి చిన్నారికి ప్రేమతో కూడిన స్థిరమైన కుటుంబాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత అవగాహన కార్యక్రమాలు - 2025 కు సంబంధించి పోస్టర్ ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ మాసాన్ని ప్రపంచ వ్యాప్తంగా దత్తత గుర్తింపు మాసంగా పాటిస్తున్న నేపథ్యంలో, జిల్లాలో దత్తతపై అవగాహనను మెరుగుపరచాలని, ప్రత్యేకించి ప్రత్యేక అవసరాలు (స్పెషల్ నీడ్స్) గల పిల్లల దత్తతను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శారీరక, మానసిక, అభివృద్ధి సంబంధిత సవాళ్లు ఉండవచ్చు కానీ వారికి అత్యవసరంగా కావాల్సింది ప్రేమ, ఆదరణ, సంరక్షణ, స్థిరమైన కుటుంబ వాతావరణం అని అన్నారు. దత్తత ద్వారా ఈ చిన్నారులకు జీవితం మార్చే అవకాశాన్ని కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం (2025) థీమ్‌ను ఫాస్టర్ కేర్ అండ్ ఫాస్టర్ అడాప్షన్ గా ప్రకటిస్తూ, పెద్ద పిల్లలకు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శాశ్వత కుటుంబాలను అందించడానికి సమాజంలో చైతన్యం పెంపొందించడమే లక్ష్యం గా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. దత్తతపై




ఇంకా సమాజంలో ఉన్న అపోహలు, భయాలు తొలగించడానికి అందరూ ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు దత్తతను ప్రేమ, మానవతా దృక్పథంతో చూడాలని, ఒక చిన్నారి భవిష్యత్తును మార్చడానికి ఒక కుటుంబం చాలు అని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆశ, భరోసా, భవిష్యత్తు ఇచ్చే ఈ మహత్తర కార్యంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతులు సంక్షేమమే లక్ష్యం

మనగళం, మంత్రాలయం : రైతులు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ ఇన్చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటిటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథాకాలను వివరించారు. అదేవిధంగా గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి అనే పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎన్.రాజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, సొసైటీ డైరెక్టర్స్ మాలపల్లి లక్ష్మన్న, చాపల నాగేష్ పోలి శివ, వీరేష్ బంద్రాళ్ల నరసింహ, ఉసెని, నర్సింహా, తిమ్మప్ప, హనుమంతు, వెంకట్రాముడు, శ్రీనివాసులు, వెంకటేష్, జనసేన యేసేబు, శ్రీకృష్ణ,



# అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌యస్) లో వస్తున్న అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన పీజిఆర్‌యస్‌కి 23 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్‌ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్‌ఓ జునైద్, ఎంఈ మనోహర్ రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కూటమి సర్కార్ కృషి



మనగళం, కర్నూలు సిటీ : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఇంటింటికి వెళ్లి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి టెక్, ఫుడ్ ప్రసెసింగ్, ప్రభుత్వ మద్దతు గురించి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేలా అనేక కార్యక్రమాలు చేపడుతూ రైతు ప్రభుత్వంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామం పంచాయతీ సెక్రటరీ గోవర్ధన్, గ్రామం టీడీపీ అధ్యక్షుడు వడ్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఎస్పీ





మనగళం, కర్నూలు క్రైం : జిల్లా కేంద్రం కర్నూలులో ప్రజలకు రోడ్డు భధ్రత , ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించేందుకు సోమవారం హెల్మెట్ , ఆటోల ర్యాలీ ని కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే విధంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్మెట్ అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ గారు ప్రారంభించారు. హెల్మెట్ ధరించి అవగాహన బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్,కలెక్టరేట్ మీదుగా సి. క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా కర్నూలు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరిగిన ఆడియోలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోకుండా బతికి బయటపడే అవకాశం ఉండేదేమో అనే విధంగా భాధితుల కుటుంబాలు చెప్పడం జరిగిందని, ఆ రోడ్డు ప్రమాదాల విడియోలతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భాద్యతగా హెల్మెట్ ధరించాల్సిందేన్నారు. మొదటి సారిగా జరిమానాలు విధించకుండా హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పిస్తామన్నారు. తర్వాత కౌన్సిలింగ్ చేస్తామన్నారు. రాబోయే రోజులలో ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లను ధరించాల్సిందేనన్నారు. అందరూ హెల్మెట్లు కోనుగోలు చేసి బైకులు నడిపే విధంగా, హెల్మెట్లు వినియోగించే విధంగా సమయం ఇస్తామన్నారు. సాయంత్రం వేళల్లో పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్ లలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన విడియోలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## ప్రతిభను గుర్తించుకునే రోజు - ప్రతి మనిషిలో దాగి ఉన్న సామర్థ్యానికి వేడుక

**– స్వీయ గుర్తింపు అవసరం పెరుగుతున్న యుగం**
**– ప్రతిభ అంటే పరీక్షల మార్కులు మాత్రమే కాదు**
**– సమాజం అంగీకారం కాక ముందే, మనమే మనల్ని అంగీకరించాలి**

ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో ప్రతిభ అనే భావనకు కొత్త నిర్వచనం ఏర్పడింది. మనలో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం, ప్రత్యేక నైపుణ్యం, ప్రత్యేక దృష్టికోణం కలిగి ఉంటాం. ఈ దాగి ఉన్న ప్రతిభను బయటపెట్టడం, మనల్ని మనం అంగీకరించడం, మన సామర్థ్యాన్ని విలువైనదిగా భావించడం ఇవన్నీ సూచించే ప్రధాన మార్మికాలు. సమాజం పెట్టే దోహదాల కంటే మన అంతరంగం ఇచ్చే ధైర్యమే మన అసలు స్వరూపాన్ని వెలిగిస్తుంది.

ప్రతిభ అంటే పుస్తకాలలో ఉన్న జ్ఞానం, గ్రేడులు, పరీక్షల మార్కులు మాత్రమే కాదు. ఒకరికి పాట పాడటం చక్కని సామర్థ్యం అయితే, మరొకరికి మాటల ద్వారా హృదయాలను కదిలించే నైపుణ్యం ఉండొచ్చు. కొందరు చేతిపని లో నైపుణ్యం కలిగివుంటారు, మరికొందరు సమస్యను నిశితంగా అర్థం చేసుకునే సామర్థ్యం కలిగివుంటారు. పిల్లల్లో ఉండే చిన్న చిన్ని నైపుణ్యాలు చాలా సందర్భాల్లో ఇంటి పెద్దలకు కనిపించవుబీ కానీ అవే నైపుణ్యాలు భవిష్యత్ లో గొప్ప విజయాలకి మార్గం చూపుతాయి.

ఈ రోజున ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే మన ప్రతిభను గుర్తించేది మొదట మనమే కావాలి. సమాజం అంగీకరించకముందే, మనకు మనమే అంగీకారం ఇవ్వాలి. ఎందుకంటే మనకన్నా మన బలహీనతలు, మన బలం, మన సాధ్యాలు ఎవరు ఎక్కువగా తెలుసుకోరు. తరచుగా మనల్ని మనం ఇతరులతో పోల్చడం వల్ల మన ప్రతిభను చిన్నచూపు చూస్తాం. అలాంటి పోలికలు మన ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తాయి కానీ ప్రతిభను కాదు. ఈ తరహా ప్రత్యేక దినాలు మనకు ఒక్క విషయం గుర్తు చేస్తాయి. “మీరు ఎవరో, మీరేం చేయగలరో, మీలో ఏముంది” అనే ఆలోచనపై మనం ఒకసారి ఆగి ఆలోచించాలి. ప్రతి మనిషి ప్రయాణం ప్రత్యేకం. ఒకరి విజయాన్ని మరొకరి ప్రమాణంగా తీసుకోవడం సమంజసం కాదు. ప్రతిభను కొలిచే కొలమానాలు ఎన్నో. వాటిలో చాలా మనకు తెలియకపోవచ్చు కూడా. కాని ఆ ప్రతిభను వెలికి తీయాలంటే మనసును వినాలి, మన ఆలోచనలను ఆప్యాయంగా పరిశీలించాలి. సోషల్ మీడియా ప్రపంచంలో ఇతరుల జీవితాలు మెరిసేలా కనిపిస్తాయి కాని నిజమైన విజయం మన వ్యక్తిగత భద్రత, మనశ్శాంతి, మన ప్రత్యేకతను కాపాడుకొని ముందుకు వెళ్లడంలో ఉంది. ఈ రోజున మనం ఒక చిన్న నిర్ణయం తీసుకుంటే చాలు “ఇతరుల మాటలతో కాదు, నా అంతరంగ స్వరంతో నడుస్తాను”. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు మన ప్రత్యేక ప్రతిభకు మార్గం ఏర్పడుతుంది. మన పిల్లలకు, యువతకు ఈ రోజున ఏదైనా ఒక కొత్త ప్రతిభను గుర్తించడంలో సహాయం చేస్తే అది ఈ దినోత్సవానికి నిజమైన అర్థం. ఒక చిన్న అవకాశం, ఒక ప్రోత్సాహం, ఒక మంచి మాట చాలాసార్లు ఇవే కొత్త ప్రతిభలకు పుట్టినిల్లు. కోతులు ఎక్కే గుణాన్ని చూసి తీర్పు ఇవ్వడం ఎలా తప్పో, అలాగే మనిషి ఏ విషయం లో బలంగా ఉన్నాడో అదే ప్రతిభ అన్న భావనను పెంపొందించాలి. మొత్తానికి, మనలో ప్రతి ఒక్కరిలోనూ ఒక ప్రత్యేకమైన కాంతి ఉంది. ఆ కాంతిని మసకబారనివ్వకుండా, మన స్వంత వేగంలో, మన శైలిలో, మన మార్గంలో మెరవాలి. అనేది పండుగ కాదుబీ అది మనపై మనకు ఇచ్చే గౌరవం. మన ప్రత్యేకతకు పెట్టే సంతకం.


## శ్రీ సుధా హాస్టల్ నందు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్



మన గళండోన్ పట్టణంలోని శ్రీ సుధా సీబీఎస్ఈహాస్టల్ నందు విద్యార్థులకు 20వ తేదీ ఫుడ్ పాయిజన్ అయినట్లు చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన కలకలం రేపింది. ఈ సంఘటనపై ఎంఈఓ ను సంప్రదించగా ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను అక్కడికి వెళ్లి విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగిందని మీడియాకు తెలిపారు. దాదాపుగా 30 నుంచి 35 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయినట్లు గుర్తించామన్నారు. ఒక ఆర్ఎంపీ డాక్టర్ తో వైద్యం చేయించినట్లు తెలిసిందన్నారు. అలాగే శ్రీ సుధా యాజమాన్యం గోప్యంగా ఉంచినట్లు మరియు యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది కావున ఇలాంటి సంఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా స్వయంగా పర్యవేక్షిస్తానని ఎంఈఓ తెలిపారు. ఈ సంఘటన మాకు కూడా ఆలస్యంగానే తెలిసిందని అన్నారు.



## జేబీ ఆఫీస్ ను ప్రారంభించిన కాటసాని



మనగళం, కల్లూరు అర్బన్ : కల్లూరు అర్బన్ పరిధిలోని 33వ వార్డు చౌడేశ్వరి కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన జేబీ ఆఫీస్ ను సోమవారం వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువనాయకుడు కాటసాని శివ నరసింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, 28వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి, మిడుతూరు శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాడైపోయిన రోడ్లను వెంటనే వేయండి.

**– కలెక్టర్ సిరి కు విన్నతి పత్రం అందజేసిన, బీసీవై పార్టీ కర్నూలు జిల్లా ఇంచార్జి ఎల్లార్తి వాల్మీకి అర్జున్ .**

( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గంలో అన్ని రోడ్లు దాదాపు పాడైపోయాయి. జిల్లాలో పచ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లను వెంటనే వేయాలని, కర్నూలు జిల్లా కలెక్టర్ అట్టా సిరి కు విన్నతి పత్రం అందజేసిన బీసీవై పార్టీ కర్నూలు జిల్లా ఇంచార్జి ఎల్లార్తి వాల్మీకి అర్జున్. ఆలూరు నుండి ఎల్లార్థి మీదుగా హొళగుంద వరకు రోడ్డు వేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పంచాయత్ రాజ్ ఎస్ఈ ను ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అర్థాంతరంగా నిలిపివేసిన రోడ్లను కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, నిలబడి పోయిన రోడ్ల పనులను పునః ప్రారంభించడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలను జారి చేసి ప్రయాణికుల మరియు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి జిల్లా కలెక్టర్ కృషి చేయాలన కలెక్టర్ కోరడం జరిగింది. ఆలూరు నియోజకవర్గ పరిధిలోని వున్న ఎల్లార్తి గ్రామంలో వెలసిన హజరత్ షాషా శెక్షావలి దర్గాలకు వేల సంఖ్యలో భక్తులు ప్రతీరోజూ వచ్చి వెళుతుంటారు. ఆలూరు నుంచి ఎల్లార్తి గ్రామానికి వాహనాలు రావడానికి చాలా ఇబ్బందులు పడుతూ అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా మన ఆలూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు వెళ్ళే ప్రతీ రోడ్ల పరిస్థితి ఇదే విధంగా వున్నాయి.సుమారుగా ఒక సంవత్సరం క్రితం రోడ్ల మరమ్మతులు చేయడానికి ప్రారంభించిన పనులను ఇంతవరకై పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు అర్థాంతరంగా పనులను ఆపి కాలయాపన చేస్తున్నారు. కావున జిల్లా కలెక్టర్ వీటిపై




ప్రత్యేక దృష్టి సారించి ఆగి పోయిన రోడ్లను తిరిగి పనులను ప్రారంభించి దిన నిత్యం ప్రయాణం చేస్తున్నటుంవంటి ప్రయాణికులకు మరియు దర్గాలకు వచ్చే భక్తులకు అద్వానంగా వున్న ఈ రోడ్ల నుంచి విముక్తి కలిగించాలనీ ఆలూరు నియోజకవర్గ ప్రజల తరుపున మరియు ఎల్లార్తి గ్రామానికి వచ్చే భక్తుల ద్వారా జిల్లా కలెక్టర్ విన్నవించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్లార్తి గ్రామ మాజీ సర్పంచ్ సునీత ఆమె భర్త బోయ తిమ్మప్ప పాల్గొన్నారు.

# ఆలూరులో టీడీపీకి బిగ్ షాక్.


**– చిప్పగిరిలో ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుండి వైసీపీ తీర్థం పుచ్చుకొన్న నాయకులు.**

( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గంలో హోలహర్వి మండలం నుండి చెందిన కమ్మ సామాజికవర్గం నుండి 30 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిప్పగిరి మండలం కాంగ్రెస్ పార్టీ నుంచి 15 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. చిప్పగిరి మండలం కాజీపురం గ్రామం నుంచి తెలుగు దేశం పార్టీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం జరిగింది. పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఆలూరు వైసీపీ ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి, కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి చెంది ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన్నారు. పార్టీలోకి వచ్చిన వారందరికీ నేను రాబోయే రోజుల్లో న్యాయం చేస్తానని మీకు హామీ ఇస్తున్న అని తెలియజేశారు. ఆలూరు వైస్సార్సీపీ ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల కన్వీనర్, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపీపీలు ఎంపిటీసీలు, కో కన్వీనర్, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.




## నేడే మొలగవల్లి శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవం.

**– అందరికి ఆహ్వానం పలికిన సర్పంచ్ మోహన్ రాజు.**



( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గం, మొలగవల్లి గ్రామంలో స్థానికంగా వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి వారికి మార్గ శిర మాసం సందర్భంగా స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఆలూరు నియోజకవర్గ ప్రజలకు, పార్టీలకు అతీతంగా నాయకులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషిలకు



ఇదే మా ఆహ్వానం పలికిన మొలగవల్లి సర్పంచు మోహన్ రాజు. ఈ కార్యక్రమంలో మొలగవల్లి సర్పంచ్ మోహన్ రాజు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బీఐ జోక్యం..

న్యూఢిల్లీ, నవంబర్ 24,మనగళం : అమెరికా కరెన్సీతో పోలిస్తే భారత రూపాయి తాజాగా కొంత మేర బలపడింది. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో రూపాయి 26 పైసలు బలపడి 89.14 స్థాయికి చేరింది. గత వారం ముగింపులో నమోదైన పతనం తర్వాత ఇది గణనీయమైన పునరుత్థానం గా మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల వరుసగా బలహీనపడుతూ చరిత్రలోనే అత్యల్ప స్థాయి 89.49 వరకు దిగజారిన రూపాయిని నిలబెట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్లో చురుకైన జోక్యం చేసుకుంది. విదేశీ కరెన్సీ నిల్వల ఉపయోగంతో డాలర్ అమ్మకాలు జరిపిన ఆర్‌బీఐ చర్యల వల్ల రూపాయి పతనం ఆగిపోయి తిరిగి బలపడిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. విదేశీ పెట్టుబడులు భారీగా వెనక్కి వెళ్లడం, భారత్%-%అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడం గతంలో రూపాయి బలహీనతకు కారణాలయ్యాయి. అయితే ఇప్పుడు ఆర్‌బీఐ గట్టి చర్యలు తీసుకోవడంతో మార్కెట్లలో కొంత స్థిరత్వం కనిపిస్తోంది. ఇకపై రూపాయి 89.20 నుంచి 90.00 మధ్య స్థాయిలో ఊగిసలాడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రూపాయి బలపడిన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా లాభాలతోనే ట్రేడింగ్ ప్రారంభించాయి. పెట్టుబడిదారుల్లో నమ్మకం కొంత మేర పునరుద్ధరించబడిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అంతర్జాతీయ పరిస్థితులు, విదేశీ పెట్టుబడుల దిశపై ఆధారపడి రాబోయే రోజుల్లో రూపాయి దిశ నిర్ణయమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి




మనగళం, నంద్యాల : నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, యేసురత్నం, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. నంద్యాల జిల్లా అయినా తర్వాత అన్ని ప్రాంతాల నుండి వేలాదిమంది రోగులు నిత్యం వస్తున్నారని, కనీస వసతులు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోగులకు సరిపడే విధంగా ఓపీ సెంటర్లు లేవన్నారు. ఓపి సెంటర్ల సంఖ్యను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. డేటా ఆపరేటర్లతో పని చేయించాలని, అదేవిధంగా మారుతున్న పరిస్థితులలో గుండె జబ్బులు ఎక్కువ అవుతున్నాయని, రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక చనిపోవడం జరుగుతుందన్నారు. వెంటనే కార్డియాలజీ విభాగం ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు సరిపడా లేవని రోగులకు, ప్రజలకు అందుబాటులోకి 24 గంటలు అందజేసేలా జనరిక్ మందుల షాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గర్భిణి లను నార్మల్ డెలివరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని, వెంటనే ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకాలను చేపట్టాలని, రోగుల బంధువులు భోజనం చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు సరిపడా వసతి సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని లేకుంటే దశలవారీగా ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం తీసుకునేందుకు నిరాకరించడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, వి ఏసురత్నం, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం, మౌలాలి పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, సత్యం, కేశాలు, నాగేంద్ర, రవి, రాణా, హుసేని, గోరెబాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గౌరు దంపతులను కలిసిన రామగిడ్డయ్య



మనగళం, కల్లూరు : రాష్ట సగర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎన్నికైన కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన ఉప్పరి రామ గిడ్డయ్య సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దంపతును ఆయన సన్మానించారు. శాలువా కప్పి గజ మాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# రీఓపెన్ దరఖాస్తులను క్లియర్ చేయండి

**– ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి – కలెక్టర్ రాజకుమారి గణియా**





మనగళం,నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీఓపెన్ అయిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి అధి కారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. రీఓపెన్ అయిన 479 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ఎంతో దూరం నుండి అర్జీదారులు మన దగ్గరికి వస్తారని, ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ లు స్పష్టంగా, నాణ్యంగా ఉండాలన్నారు. బియాండ్ ఏసీఏ లో ఉన్న 5 దరఖాస్తులు, ఇంకా చూసుకోని దరఖాస్తులు 63 ఉన్నాయని... ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అలాగే వీఐపీ గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

**నా భూమి ఆక్రమణకు గురైంది....**

నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, కలచర్ల గ్రామానికి చెందిన యు. చిరంజీవి తనకున్న పొలం "సర్వే నెంబర్ 55/2లోని నా 1.60 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. భూమిని సర్వే చేయించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. బేతంచెర్ల మండలానికి చెందిన కే. రమేష్ అనే దివ్యాంగుడనైన తనకు ప్రస్తుతం రూ. 6,000 పెన్షన్ వస్తోందన్నారు. నేను పూర్తిగా వికలాంగుడిని, మంచానికే పరిమితమైన తనకు రూ. 15,000 పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని బాధితులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

# ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించండి




మనగళం, నంద్యాల : ప్రజల్లో హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై సరైన అవగాహన పెంపొందితేనే జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడం సాధ్యమని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్.ఐ.వి/ఎయిడ్స్ చట్టం%-%2017, తల్లి%-%బిడ్డ రక్షణపై అవగాహన కల్పించే గోడ పత్రికను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. గోడ పత్రికలను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేయాలని తెలిపారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బాధితులపై వివక్ష లేకుండా సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం, అలాగే తల్లిలో నుండి శిశువుకు హెచ్.ఐ.వి సంక్రమణను నివారించేందుకు ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడం ఈ ప్రచార పత్రిక ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిష్కరించండి

**– నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేయండి**
**– డ్రోన్ వినియోగ వివరాలను ప్రతిరోజూ నమోదు చేయండి**
**– జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నవంబర్ 7న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నందికొట్కూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని మద్యం దుకాణం విద్యార్థుల్లో చెడు అలవాట్లకు దారితీస్తోందని వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఇదే మండలంలో నిర్మిస్తున్న ఎన్హెచ్ 340 సి రహదారి కారణంగా బ్రాహ్మణకొట్కూరు రైతులు సాగు భూములకు వెళ్లలేకపోతున్నందున సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హంద్రీ%-%నీవా కెనాల్ పనుల్లో పొలాల్లో పడిన ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో జరిగే సమావేశాలకు జడ్పిటిసి, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ప్రోటోకాల్ ప్రకారం తప్పనిసరిగా ఆహ్వానం పంపాలని డిప్యూటీ సీఈఓకు ఆదేశాలు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో రీసర్వే పనులకు తహసీల్దార్ హాజరు కాకపోవడం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బన్నూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ, వ్యవసాయ అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల కేటాయింపులో లోపాలు రాకుండా చూడాలని ఆదేశించారు. డిసిల్టింగ్ పనులు బండ్ బలపరచే విధంగా ఉండాలని, దుద్యాల గ్రామంలోని చెరువు అక్రమణలను తొలగించాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. దేవాదాయ శాఖకు చెందిన కురుకుంద గ్రామ దేవాలయాలకు సంబంధించిన గెజిట్ వివరాలు ఇవ్వాలని దేవాదాయశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. శనగ విత్తనాల పంపిణీ అర్హులైన రైతులకు పూర్తిగా జరగాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటుచేయాల్సిన 7 నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లలో పాణ్యం, ఆత్మకూరు, ఆళ్లగడ్డ యూనిట్లు ఇంకా ప్రారంభం కాలేదని, వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు అందజేసిన డ్రోన్ల వినియోగాన్ని ప్రతిరోజూ డ్రోన్ మార్ట్‌లో నమోదు చేయాలని, ఎన్ని గంటలు ఫ్లై చేశారో, ఏ పనులకు వినియోగించారో శాఖాపరమైన ఈమెయిల్ ఐడీలతో కలెక్టరేట్‌కు పంపాలని కలెక్టర్ సూచించారు.

# ఏ,బీ,సీ క్యాంపుల్లోనే హైకోర్టు బెంచ్



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ఏ బీ సీ క్యాంపుల్లోనే హైకోర్టు బెంచ్ వస్తుందని , వెనుకబడ్డ కర్నూలు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నామని , కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీరుస్తామని బుధవార్ పేట లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. సోమవారం సాయంకాలం బుధవార పేట దగ్గర మెడికల్ కాలేజ్ నుండి షాషా మసీదు వరకు రూపాయలు 34.68 లక్షలు ఖర్చు తో బిటి రోడ్డు వేయుట , సి సి డ్రయిన్స్ నిర్మించుట , పైపులైను మరమ్మత్తులు మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు సంబంధించి భూమి పూజ చేసి పైలాన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ... ఈ ప్రదేశంలో గత రెండు దశాబ్దాల నుండి రోడ్డు ఇరుకుగా ఉండి పలు ప్రమాదాలు జరిగి పలువురు మరణించడం జరిగిందని దానిని దృష్టిలో పెట్టుకుని మసీదు కమిటీ వారితో చర్చలు జరిపి అవసరం మేరకు నిర్మాణాలను తొలగించడం జరిగిందని, ఇప్పుడు ట్రాఫిక్ కు అంతరాయం ఉండదని తెలియజేశారు. కర్నూలు నగరంలోని ఏ , బి , సి క్యాంపు ల లోనే హైకోర్టు బెంచ్ ను ఏర్పాటు చేస్తామని, ఈ విషయంపై గవర్నర్ అబ్దుల్ నజీర్ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు ఏర్పాట్లు ఉంటాయని తెలియజేశారు. కర్నూలు ఓల్డ్ టౌన్ లో కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమాలు కూడా అందరి ఆమోదంతో చేస్తామని , అలాగే కళ్యాణ్ జ్యువెలర్స్ నుండి బుధవారం పేటకు హంద్రీ నదిపై వంతెన కూడా నిర్మించే ఆలోచనలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ మధ్య కర్నూలు లో చేపట్టిన జాబ్ మేళాలో 900 మందికి ఉద్యోగాలు వచ్చాయని, వచ్చే నెల 8 న కూడా జాబ్ మేళా నిర్వహిస్తామని అందులో కూడా యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. ఈమధ్య జరిగిన వైజాగ్ పారిశ్రామిక సదస్సులో 13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని తెలియజేశారు. కర్నూలు జిల్లా కు 23 వేల కోట్ల రూపాయల సెమీ కండక్టర్ పరిశ్రమ రానున్నదని ఇప్పటికే 10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు వీటన్నిటి వల్ల రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు వస్తాయని రాష్ట్రము అభివృద్ధి దిశగా పయనిస్తుందని మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు మాట్లాడుతూ...మెడికల్ కాలేజ్ దగ్గర రోడ్డు విస్తరణ విజయవంతం కావడం మంచి శుభ పరిణామం అని , కొంతమంది ఈ విషయాన్ని రాజకీయం చేయాలని చూశారని ఆరోపించారు. మంత్రి , అధికారులు చాకచక్యంగా సమస్యను పరిష్కరించారని, వారందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు , మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ , మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్ , మున్సిపల్ ఇంజనీర్ శేష సాయి, స్థానిక నాయకులు మన్సూర్ , అబ్బాస్ , రామాంజనేయులు , స్వామి రెడ్డి , పరమేశ్వర యాదవ్ , మస్జిద్ కమిటీ సభ్యులు , ముత్తవల్లీలు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సహకరించండి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల సిటీ: ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న దేశవ్యాప్తంగా నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సైనికుల సంక్షేమ నిధికి జిల్లా ప్రజలు ఉదారంగా చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫ్లాగ్ డే పోస్టర్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సైనిక సంక్షేమ అధికారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో శత్రువులను ఎదుర్కొంటూ, అంతర్గత విపత్తుల సమయంలో ప్రజలను రక్షిస్తూ సాయుధ దళాలు దేశం కోసం అపారమైన త్యాగాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వారి సేవలు, త్యాగాలను స్మరించుకునేందుకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఫ్లాగ్ డే నిధి సేకరణ చేపడతామని తెలిపారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తుల్లో ప్రజలను రక్షించడం నుండి ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడం వరకు భారత సైన్యం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడు తన వంతు సహాయం అందించాలని సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు







మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (24.11.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

## పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం



మన గళం కర్నూలు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులందరికీ ఏడాది 20,000 ఆర్థిక సహాయం చేస్తామన్న హామీ నెరవేర్చిన సందర్భంగా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈరోజు కర్నూలు మండలం నిడ్జూర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మొదటి విడతగా 7000 రెండో విడతగా 7000 రూ.లు రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని రైతులకు వివరించి కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చేస్తున్న మేలును రైతులకు వివరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.. అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కావడంతో రైతులందరూ సంతోషంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అగ్రికల్చర్ ఆఫీసర్లు, మండల కూటమి నాయకులు, రైతులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వీరభద్ర స్వామికి వెండి కిరీటం విరాళం



మనగళం శ్రీశైలం : ఈ రోజు (23.11.2025) శ్రీ యం. సుబ్రమణ్యం, శ్రీశైలం వారు శ్రీ బయలు వీరభద్రస్వామివారికి అలంకరింపచేసేందుకు వెండికిరీటం, రెండు వెండి కర్ణాలు, రెండు వెండి నేత్రాలను విరాళంగా సమర్పించారు. వీటి బరువు 1 కేజీ 230 గ్రాములు అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాత వీటిని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు విజయస్వామి, అర్చకస్వాములు, వేదపండితులు, పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టర్ కె. మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ ఎం.సావిత్రికి అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## సాంస్కృతిక కార్యక్రమాలు భాగంగా కడప వారిచే సాంప్రదాయ నృత్య ప్రదర్శన





మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న భాగంగా కడప వారిచేధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (23.11.2025) శ్రీ డి. తిరుపతి మరియు వారి బృందం,కడప వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యకార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ కార్యక్రమములో మూషికవాహన, మహాగణపతిం, ఓం నమ:శివాయ, శివపార్వతుల కల్యాణం, శివ శివ శంకరా, అయిగిరినందిని, శివతాండవం, శంభో హర హర, తదితర గీతాలకు తిరుపతి, విజయబాబు, శివ, శివకుమార్ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## జనసేన భీమా..... కార్యకర్తలకు ధీమా : ఆకెపోగు రాంబాబు



మన గళం కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ మంగళగిరి తాడేపల్లిలో అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్ నందు కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు మండలం కోడుమూరు గ్రామానికి చెందిన బండ శ్రీనివాసులు గత ఎనిమిది నెలల క్రితం ప్యాలకుర్తి గ్రామం దగ్గర రోడ్డు ప్రమాదంలో మరణించారు వారు కుటుంబానికీ జనసేన పార్టీ తరపున 5 లక్షలు ఆర్థిక సాయం చెక్కును అందించిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు గౌరవ కొణిదెల నాగబాబు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి %బ% రాష్ట్ర %మీవీజు% చైర్మన్ గౌరవ తమ్మిరెడ్డి శివశంకర్ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరవ శ్రీ రామ్ తాళ్లూరి గారు ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదంలో మరణించారు 220 కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి 5 లక్షల చొప్పున 11 కోట్ల రూపాయల చెక్కులు అందజేశారు ఈ సందర్భంగా బండ శ్రీనివాసులు భార్య మాట్లాడుతూ లలితమ్మ బండ శ్రీనివాసులు చెల్లెలి జగదీశ్వరమ్మ మాట్లాడుతూ మా కుటుంబానికి జనసేన పార్టీ తరపున ఆర్థిక సాయం అందించిన పవన్ కళ్యాణ్ రుణం తీర్చుకోలేనిది అని జనసేన పార్టీకి ఎప్పుడు మా మద్దతు ఉంటుంది అని, మాకు ఈ సహాయం రావడానికి కృషి చేసిన కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు క్రియా వాలంటరీ శ్రీకృష్ణ మరియు వినోద్ కు ధన్యవాదాలు తెలిపారు.

## డిసెంబరు 1 నుండి కార్తీకమాస శివదీక్ష విరమణ




మనగళం శ్రీశైలం : డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు కార్తీకమాస శివదీక్షా విరమణ కార్యక్రమము ఏర్పాటు చేయబడింది. ఇందుకు అవసరమైన ఆయా ఏర్పాట్లు చేయబడుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం అయిదు రోజుల పాటు ( 01.12.2025 నుండి 5.12.2025 వరకు) పాతాళగంగ మార్గములోని శివదీక్షా శిబిరాలలో ఈ దీక్షావిరమణ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. అక్టోబరు 22వ తేదీన శివమండల దీక్షను, నవంబరు 11వతేదీన అర్థమండలదీక్షను స్వీకరించిన భక్తులు ఈ దీక్షా విరమణ సమయంలో దీక్షను విరమించవచ్చు. ఈ దీక్షావిరమణ సందర్భంగా డిసెంబరు 1వ తేదీ ఉదయం స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి విశేషపూజలు నిర్వహించబడుతాయి. తరువాత శ్రీ స్వామి అమ్మవార్లను రథవీధిలో మంగళవాయిద్యాల నడుమ వేద మంత్రాలతో ఊరేగింపుగా తీసుకొని వెళ్లి శివదీక్ష శిబిరాలలో వేంచేబు చేయించడం జరుగుతుంది. అధిక సంఖ్యలో దీక్షావిరమణ చేసే భక్తుల కోసం మూడు వంతులుగా సిబ్బందికి శివదీక్షా శిబిరాలలో ప్రత్యేక విధులను కేటాయించబడ్డాయి. కాగా మన పురాణాలలోను, వ్యవహారిక గాథల్లోనూ ఈ శివదీక్షా ప్రాశస్త్యం ఎంతగానో చెప్పబడింది. చారిత్రకంగా కూడా ఈ శివదీక్షకు ఆధారాలు ఉండటం విశేషం. బాదామి చాళుక్య రాజైన రెండవ విక్రమాదిత్యుడు ఆంగ్లశకం 660 సంవత్సరంలో శివమండలదీక్షను స్వీకరించినట్లు గాను మరియు దీక్షను ఇచ్చిన శివగురువు సుదర్శనాచార్యునికి వంగూరుసీమలోని (నేటిమహబూబ్‌నగర్ జిల్లా) ఇపరుంకల్ అనే గ్రామానికి గురుదక్షిణగా ఇచ్చినట్లుగాను, అలంపూరు మండలంలోని ఆముదాలపాడులో లభించిన విక్రమాదిత్యుని తామ్రశాసనం చెబుతోంది.

## అన్న ప్రసాదా వితరణకు భారీ విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ టి. హేమాచలపతిరెడ్డి, చిత్తూరు వారు ఈ రోజు ( 24.11.2025)న అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ. 1,00,116 /- లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

## శ్రీశైలం విచ్చేసే భక్తులకు గమనిక



మనగళం శ్రీశైలం : శ్రీశైలంలో దేవస్థానం వసతిని ముందస్తుగా రిజర్వు చేసుకునేందుకు మరియు ఆయా ఆర్జితసేవలను, దర్శనం టికెట్లను ముందస్తుగా పొందేందుకు భక్తులు రాష్ట్ర దేవదాయశాఖ లేదా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేశారు. వసతిని ఆన్‌లైన్‌లో రిజర్వు చేసుకునేందుకు మరియు అన్ని ఆర్జితసేవా టికెట్లు, శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం టికెట్లు, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం మొదలైన అన్నిటికెట్లను ఆన్‌లైన్‌లో పొందేందుకు భక్తులు రాష్ట్ర దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ లేదా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ లను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. దేవదాయశాఖ లేదా దేవస్థాన అధికారిక వెబ్సైట్ల ద్వారా రిజిస్ట్రేషన్ పొందునప్పుడు ఫోన్పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా నగదు మొత్తము వ్యక్తి గత ఖాతాలోకి జమ చేయమని ఎవ్వరూ కూడా అడగడం జరగదని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి అన్నారు. కాబట్టి ఎవరైనా ఫోన్పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా నగదును తమ ఖాతాలో చెల్లించమని అడిగినప్పుడు దానిని సైబర్ మోసంగా గుర్తించవలసినదిగా కూడా వారు తెలియజేశారు. ఈ విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేవస్థాన మరియు దేవదాయశాఖ వెబ్‌సైట్ కాకుండా భక్తులు ఇతర నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని వారు సూచించారు. సందేహ నివృత్తి కోసం భక్తులు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 / లను సంప్రదించవచ్చునని వారు తెలియజేశారు.

### శ్రీ శ్రీశైల భ్రమరాంబం మల్లికార్జున స్వామి అన్నప్రసాదానికి భారీ విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీ బైరెడ్డి సుభాష్‌రెడ్డి, కర్నూలు వారు ఈ రోజు ( 24.11.2025)న గో సంరక్షణ పథకానికి విరాళం రూ. 1,00,008 /- లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.


# ఘనంగా సుమన్ టీవీ డోన్ కార్యాలయం ప్రారంభోత్సవం


(మన గళం,డోన్) : సుమన్ టీవీ డోన్ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సుమన్ టీవీ కర్నూలు,మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ఫ్రాంఛైజీ పార్ట్ నర్, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర భాజపా నేత నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమన్





**- కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు**







టీవీ నంద్యాల డైరెక్టర్ లోకేష్ శిరీష దంపతులు మొదట కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమన్ టీవీ డోన్ కార్యాలయం ప్రగతి పథంలో సాగాలని అతిథులు ఆకాంక్షిస్తూ,సుమన్ టీవీ యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్ నాథ్ రెడ్డి, నేత సంజీవరెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఆలంకొండ నబీ రసూల్, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి, నేత నగరూరు రాఘవేంద్ర సతీమణి హిమబిందు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో సుమన్ టీవీ కర్నూలు ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్ ఎన్.జి.కిరణ్, సీనియర్ కరెస్పాండెంట్ యస్.బి.నందకిషోర్, డోన్ రిపోర్టర్ మాదన్న, హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్స్ ఇన్ ఛార్జ్ వేముల శివప్రసాద్, ఎల్ఐసీ రామాంజనేయులు, సివిల్ ఇంజనీర్ గోపాల్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కాటం సాయి, రిపోర్టర్లు మునుస్వామి, షాన్ ఇమ్మానియేల్,యాంకర్ పల్లె హర్షవర్ధన్,



న్యాయవాదులు కోటి యాదవ్, గణేష్, విజయ్, పర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'రైతన్నా - మీకోసం' ప్రారంభం..

**- 24 నుంచి 29 వరకు రైతుల పరామర్శ టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవాలి..**



నందవరం నవంబర్ 24 మనగళం న్యూస్ : నందవరం మండలంలోని మాచపురం గ్రామంలో తన సొంత నివాసంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రైతన్నా - మీకోసం వారోత్సవాల కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎమ్మిగనూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 నుంచి 29 వరకు ఆరు రోజులపాటు రైతుల ఇంటింటికి వెళ్లి పరామర్శ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు రైతుల ఇళ్ళ నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తారన్నారు. ఏడవ రోజు డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల వద్ద వర్క్ షాప్ నిర్వహించి రబీ 2025 -26, ఖరీఫ్-2026, రబి 2026 27కు సంబంధించి యాక్షన్ ప్లాన్ ను తయారు చేయనున్నట్లు తెలిపారు. చివరగా ముఖ్యమంత్రి 5 సూత్రాలను వివరిస్తారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన గురించి రైతులకు వివరించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా రైతుల ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి రైతులందరూ సహకరించాలని కోరారు.

# పీఎంఏవై ఇళ్ల సర్వే వేగం పెంచాలి

**- ఎస్ ఎస్ ట్యాంక్ లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ ల మరమ్మతులు పూర్తి చేయాలి**
**- ఎలక్టర్ల మ్యాపింగ్ లో పురోగతి తీసుకురావాలి**
**- పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలి - కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ ( పీఎంఏవై-జీ 2.0) ఇళ్ళ సర్వేలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి స్వమిత్వ, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లు, చెరువుల్లో నీటిని నింపడం, రెవెన్యూ, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ కు సంబంధించి జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (పీఎంఏవై-జీ 2.0) పథకంలో ఇళ్ళ మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతి గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి అర్హత కలిగి, ఇళ్లు లేని వారి పేర్లు నమోదు చేయడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. ఇల్లు మంజూరు అయిన వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 30వ తేదీ తర్వాత పేరు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉండదన్నారు. సర్వే సరిగా జరగలేదని ఒక ఫిర్యాదు వచ్చినా కూడా ఉపేక్షించేది లేదని, సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 246 మైక్రో ఇరిగేషన్ ట్యాంక్ లు ఉన్నాయని, 35 ఎస్ ఎస్ ట్యాంక్ లు ఉన్నాయన్నారు. మరమ్మతులు ఏమైనా ఉన్నట్లయితే త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ నెల నుండి నీటిని నింపే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రతికూల వార్తలు వ్యతిరేక వార్తలు తరచుగా వస్తున్నాయన్నారు.. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు తనిఖీ లు ముమ్మరంగా చేపట్టి, అక్రమ ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఎలక్టర్ల మ్యాపింగ్ లో పురోగతి తీసుకొని రావాలన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ బాగా జరుగుతోందన్నారు. కర్నూలు నియోజకవర్గంలో పురోగతి అంతగా లేదని, బిఎల్ఓ ల వారిగా సమీక్ష నిర్వహించుకుని ఎలక్టర్ల మ్యాపింగ్ లో పురోగతి తీసుకొని రావాలన్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియ కు సంబంధించిన కాటన్ మిల్లులను ఆర్డీఓ లు, తహసీల్దార్ లు తరచుగా తనిఖీ చేయాలన్నారు. అందుకు సంబంధించిన ఫోటోలను గ్రూప్ లో పోస్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సి సి ఐ వారికి తేమ శాతం 13, 14 ఉన్న కొనుగోలు చేయాలని కోరామని, వాటిని మానిటర్ చేసుకోవాలన్నారు. 14 శాతం కంటే తేమ శాతం ఎక్కువగా ఉంటే మిల్లు వారు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. అదే విధంగా తూకాలు చేసే యంత్రాలను తనిఖీ చేయాలన్నారు. స్వమిత్వ సర్వే కు సంబంధించి ఫేజ్ 1 లో పెండింగ్ లో ఉన్న గ్రామాల్లో సర్వేయర్ లతో కో ఆర్డినేట్ చేసుకొని సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫేజ్ 2 లో జరుగుతున్న గ్రామ సభలు శనివారం నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ప్రహారికి అక్రమంగా వేసిన ప్రైవేట్ బంకులను తొలగించాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్




మన గళం కోడుమూరు: కోడుమూరు మండల కేంద్రంలో ఉన్న జివిఆర్ జడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ కి వేసిన అక్రమ బంకులను తొలగించాలని ఈరోజు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల నుండి ఎంపీడీఓ ఆఫీస్ వరకు ర్యాలీ గా వెళ్లి ధర్నా నిర్వహించి, అనంతరం మండల ఎంపీడీవో రాముడుకు కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మండల కార్యదర్శి ఎస్. అల్తాఫ్ బాషా మాట్లాడుతూ స్థానిక కోడుమూరు మండల కేంద్రంలో ఉన్న జివిఆర్ జడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులు దాదాపు 1500 మంది మంది విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రహారికి అక్రమంగా ప్రైవేట్ బంకులు వేసుకొని విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారన్నారు. విద్యార్థులు స్కూల్ లకు రావడానికి గాని స్కూల్ లు వదిలిన తర్వాత మరల తిరిగి ఇంటికి వెళ్ళడానికి గాని అనేక అవస్థలు పడుతూ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల ముందు రోడ్డు రవాణా చాలా ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా అక్కడ ఉన్నటువంటి షాపుల్లో సిగరెట్స్ గుట్కాలు అమ్ముతున్నారు. ఇలాంటి చెడు వ్యసనాల కు అలవాటు పడి విద్యార్థి చెడిపోయే ఆవశ్యకత ఏర్పడుతుంది మరియు ఎక్కువ రవాణా ఉండడంతో అటువైపు ఇటువైపు రోడ్డుపైన నడుచుకుంటూ వెళ్లడానికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థిని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తమరి దృష్టిలో ఉంచుకొని తక్షణమే పాఠశాలల ప్రహరీ గోడకు ఆనుకొని వేసినటువంటి అక్రమ బంకులను తక్షణమే తొలగించాలని వారు కోరారు. ఏఐఎస్ఎఫ్ విజ్ఞప్తి మేరకు మండల ఎంపీడీవో రాముడు స్పందిస్తూ %జూ=ఞ% మంజుల మేడం పిలిచి మూడు నాలుగు రోజుల్లోపు సమస్య పరిష్కారం చేసే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది.ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు మహేంద్ర, పాండు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి సెంటర్ ను బలోపేతం చేయండి సిఐటియు డిమాండ్




మన గళం కోడుమూరు: అంగన్వాడి వర్కర్స్ సమస్యలపై కోడుమూరు తహసిల్దార్ కార్యాలయం నందు ప్రాజెక్టు కార్యదర్శి సూలమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు సిఐటియు మండల కార్యదర్శి గఫూర్ మియా హాజరై మాట్లాడారు ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు చాలీచాలని జీతంతో తమ కుటుంబాలను పోషించలేక పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు దానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం రకరకాల మొబైల్ యాప్ల తీసుకుని వచ్చి వేధింపులకు గురి చేస్తున్నారు మొబైల్ ద్వారా యాప్ లో ఉన్నటువంటి పనులను చేద్దామంటే నాసిరకం మొబైల్స్ తో పని జరగడం లేదు దీనికి తోడు ఇంటర్నెట్ కూడా సహకరించడం లేదు అలాగే పట్టణ ప్రాంతంల్లో మండల కేంద్రాలలో ప్రైవేటు విద్యాసంస్థలు చాలా పెరుగుతున్నాయి ఆ విద్యా సంస్థలు పోటీపడి మరి మూడు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను తక్కువ ఫీజు తీసుకుంటామని తల్లిదండ్రులను మభ్యపెట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు వాటి కారణంగా అంగన్వాడి కేంద్రాల్లో ఉండాల్సినటువంటి మూడు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలు సెంటర్స్ లో తగ్గిపోతున్నారు రోజురోజుకు అంగన్వాడి కేంద్రాలు పిల్లలు తగ్గి బోసిపోతున్నాయి అని వారు తెలియజేశారు అలాగే దీనికి తోడు పిల్లలు తగ్గారని పై అధికారుల ఒత్తిడితో అంగన్వాడి కార్యకర్తలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు కానీ ప్రైవేటు పాఠశాలలు మూడు సంవత్సరాల నుండి పిల్లలను చేర్పించుకుంటున్నారు అలాంటివి అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆయన అన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడు నాలుగు సంవత్సరాల వయసు గల పిల్లలను చేర్చుకోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు అంగన్వాడి కేంద్రాలలో చిన్న పిల్లలకు మంచి పౌష్టిక ఆహారంతో పాటు ఆటపాటలు క్రమశిక్షణ నేర్చుకుంటారు అలాగే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారు ఇంత చిన్న వయసులో పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో వదిలితే వారి మెదడుపై భారం పడి పిల్లల ఎదుగుదల తగ్గుతుంది అదే అంగన్వాడీ కేంద్రాల్లో ఉంటే పిల్లలకు విశ్రాంతి దొరుకుతుంది సమయానికి పౌష్టికాహారం తిని పిల్లలు బాగుంటారు ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలు తక్కువగా ఉన్నారని అంగన్వాడి కార్యకర్తలపై ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బందులు పెడితే సిఐటియు యూనియన్ గా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు దాదాపుగా 11 సంవత్సరాల నుండి ఒక్క పైసా కూడా జీతం పెంచలేదు కనీసం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న అంగన్వాడీ కార్యకర్తలు ఈ ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాం అనుకుంటే ఈ కూటమి ప్రభుత్వం కూడా వారి సమస్యలు పట్టించుకోవడం లేదు జీవో ప్రకారం 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలి అలాంటిది అందులో సగం కూడా ఇవ్వడం లేదు ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించి నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రస్తుతం ఉన్న యాప్లన్ని తగ్గించి ఒకటే యాప్ కింద తీసుకొని రావాలి నాణ్యమైన మొబైల్ ఫోన్లు ఇవ్వాలి అని వారు డిమాండ్ చేశారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కార్యాలయంలో అధికారికి అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జిపి వీరన్న. కుమారస్వామి. అంగన్వాడి నాయకురాలు అరుణ. నాగమ్మ. భాగ్యమ్మ. రజియా. హైమావతి కోడుమూరు పట్టణంలోని అంగన్వాడీ కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.